క్లుప్తంగా

గ్రామాల్లో పోలీస్ బలగాల కవాతు



పినతాడివాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

డెంకాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఎస్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు మండలంలోని పినతాడివాడ, పెదతాడివాడ, డెంకాడ గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో కవాతు నిర్వహించారు.

పూరిల్లు దగ్ధం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

భోగాపురం: మండలంలోని చేపలకంచేరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో మైలపల్లి దానయ్యమ్మకు చెందిన పూరిల్లు కాలిపోయింది. ప్రమాదంలో రూ.3.5 లక్షలు నగదుతో పాటు 4 తులాల బంగారం కాలిపోయాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, బీఆర్వో సుజాత మంగళవారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సెంచూరియన్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్టోమెట్రిస్ట్‌లు

విజయనగరం అర్బన్: సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల విద్యార్థులకు మంగళవారం నేత్ర పరీక్షలు జరిపారు. సామాజిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో 90 మంది విద్యార్థులకు పరీక్షలు చేపట్టారు. వీరిలో 24 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. శ్రీసాయి గాయత్రి జూనియర్ కళాశాలలో పరీక్షించిన 46 మందిలో 12 మందికి దృష్టి లోపం గుర్తించారు. అనంతరం పరిశుభ్రత అంశంపై అవగాహన కలిగించారు. నేత్ర పరీక్షలను వైద్యులు ఆప్టోమెట్రిస్ట్ పడాల ఈశ్వర్, బెనర్జీ నిర్వహించారు. గాయత్రి కళాశాల కరెస్పాండెంట్ నవీన్, శ్రీనివాస వర్మ, సెంచూరియన్ అధ్యాపకులు హేమసుందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన



కోలాట ప్రదర్శనలో మహిళలు

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారికి ప్రతీ వారం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి ఆలయ ఆవరణలో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి కోలాట ప్రదర్శన ఆద్యంతం మంత్రముగ్ధుల్ని చేసింది. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు నేతృత్వంలో జొన్నవలస రమణమ్మ శిష్య బృందం 30 మందితో నిర్వహించిన కోలాట ప్రదర్శన చూపరులను కట్టి పడేసింది. అనంతరం ఆలయ అధికారులు కోలాటంలో పాల్గొన్న వారందరికీ అమ్మవారి శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రసాదరావు, సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఆర్.సూర్యపాత్రో తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సత్కారం



సచివాలయ కార్యదర్శులను సత్కరిస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నుల(ప్రైవేటు) వసూలులో రాష్ట్ర స్థాయిలో నెల్లిమర్ల నగర పంచాయతీ ప్రథమ స్థానంలో నిలిచినందుకుగాను, శత శాతం పన్నులు వసూలుకు కృషి చేసినందుకుగాను గాంధీనగర్‌కాలనీ, మొయిద జంక్షన్-2 సచివాలయాల వార్డు పరిపాలన కార్యదర్శులను నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ టివిఎస్.విశ్వేశ్వరరావు, ఆర్ఐ ఎ.రాజ్యలక్ష్మి, బి తులసీ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



ప్రచారంలో పాల్గొన్న కోలగట్ల వీరభద్రస్వామి, బెల్లాన చంద్రశేఖర్

- గెలిచేది మనమే... 1వ తేదీకే పింఛన్ ఇచ్చే బాధ్యత మాదే
- టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు స్వాగతించరు
- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- 7వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఇచ్చిన మాటకు కట్టుబడి గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాశీర్వాదంతో మరోసారి ముఖ్యమంత్రి కావటం ఖాయమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 7వ డివిజన్ అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుండి ప్రారంభమైన ఎన్నికల ప్రచారంలో ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఇరువురు నేతల రాకను పురస్కరించుకొని స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. బాణాసంచాను కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. మహిళలు హారతులిచ్చి విజయ తిలకాలను దిద్దారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజా స్పందన చూస్తుంటే అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుస్తారన్న ధీమాను వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్ల ప్రజాదరణ పెరగడం చూసి టీడీపీ నాయకులు లేనిపోని కుయుక్తులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చివరకు వృద్ధులకు అందిస్తున్న పింఛన్లను కూడా సకాలంలో అందనివ్వకుండా చేశారని ఆరోపించారు. అయినా అధైర్య పడకుండా మరో రెండు నెలలు ఓపిక పడితే రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని మరలా ఒకటో తేదీ ఉదయానికల్లా పింఛన్లు అందజేసే బాధ్యత తాము తీసుకుంటామని చెప్పారు. నగరంలో అభివృద్ధి ఏంటో చూపించిన ఘనత కోలగట్ల వీరభద్రస్వామికే దక్కుతుందన్నారు. రహదారుల విస్తరణ, ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా బృహత్తర ప్రణాళికను రచించి అందరికీ నీటి సౌకర్యాన్ని కల్పించిన కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయులని అన్నారు. మరోసారి శాసనసభ్యులుగా కోలగట్లను, పార్లమెంట్ సభ్యునిగా తనను గెలిపించాలని కోరారు. మేయర్ వి.విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి, బంగారు నాయుడు, కార్పొరేటర్ గాదం మురళి, జోనల్ ఇన్‌చార్జిలు బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీపీ రాజు, చిట్టి రాజు, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

మనసున్న నేత.. సీఎం జగన్



గుంపాంలో ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: ప్రజా సమస్యలు తెలుసుకుని వారి అవసరాలకు అనుగుణంగా పని చేసే మనసున్న నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తొత్తడాం, గుంపాం గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత అడుగు అడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికి వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలలో ప్రకటించిన నవరత్నాలు నూటికి నూరు శాతం పూర్తి చేశారన్నారు. తమ ప్రభుత్వ కాలంలో మీకు మేలు జరిగితే ఓటు వేయాలని అని ధైర్యంగా చెప్పిన వ్యక్తి జగనన్నేనని పేర్కొన్నారు. జగనన్న సీఎం అయిన తరువాత ప్రతి నెలా 1వ తేదీన ఉదయం 6 గంటలకే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేస్తున్నారని, చంద్రబాబు పగతో ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకొని పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. గడిచిన 59 నెలలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు వలంటీర్లపై వివాదస్పద వ్యాఖ్యలు చేస్తూ తమ అక్కసు వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. ఐదేళ్లగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలు మంజూరు చేయించామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, ఎడ్ల రామకృష్ణ, పిన్నింటి ఎల్లంనాయుడు, కిలారి సురేష్, దాడిశెట్టి త్రినాథరావు, నడిపేన రమణ, పుప్పాల లక్ష్మీనారాయణ, కోట్ల రఘు, దేశెట్టి గణేష్, చాపల సత్తిబాబు, బొల్లు రమేష్, తాటిశెట్టి బాబు, గాబు సూరప్పన్నరెడ్డి, మహంతి లక్ష్మణరావు, శాంతాటి శ్రీనివాసురావు, టొంపల సీతారాం, వాళ్లె సన్యాసినాయుడు, బొడ్డు ఎల్లాజీ, పైడిమదు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు అభినందన



వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న చిన్న సోల్జర్స్ సభ్యులు

విజయనగరం: గత నెల 29, 30 తేదీలలో జైపూర్ (రాజస్థాన్)లో జరిగిన 12వ పారా వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న శ్రీ విజయదుర్గా దివ్యాంగుల సంక్షేమ సంఘం క్రీడాకారులను చిన్న సోల్జర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సిరి సహస్ర అభినందించారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో మహిళలకు ఐదవ స్థానం, పురుషులకు నాలుగో స్థానం సాధించారు. భవిష్యత్‌లో ఇటువంటి మరెన్నో బహుమతులు అందుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఇక ముందు క్రీడాకారులకు ఏ అవసరం వచ్చిన తమ సంస్థ వారికి తగు సహాయ సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. కృషి, పట్టుదలతో క్రీడలలో నైపుణ్యం సాధించి, విజయనగరం జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో మరింత మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్

విజయనగరం పూల్‌బాగ్: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి రంగాల సంక్షోభంపై విద్యార్థి, యువకులు పోరాడాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభ నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.అప్పలరాజు అధ్యక్షతన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం, భారతదేశంలోని సంపన్న వర్గంతో కలిసి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరిశిక్ష పేరుతో హత్య చేసిందని అన్నారు. చిన్న వయస్సులోనే సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం అంకితభావంతో పోరాడారని అయితే నేటికీ కూడా ఆ లక్ష్యం నెరవేరలేదని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షుడు సోమేష్, నాయకులు బి.రాకేష్, సిహెచ్.దిలీప్, ఎ.దినేష్, కె.శ్రీను, సిహెచ్.అప్పలరాజు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని రెడ్ క్రాస్ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎం.ఆర్ ఫార్మసీ కళాశాల పూల్‌బాగ్ వద్ద సీపీఆర్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చికిత్స విధానం వల్ల రోగి ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. గుండె ఆగినప్పుడు, కరెంట్ షాక్, పాము కాటు, భయం లాంటి కారణాలు కూడా కార్డియాక్ అరెస్ట్‌కు దారి తీస్తాయని చెప్పారు. అలాంటప్పుడు అందించే ప్రాథమిక చికిత్స వల్ల రోగి ప్రాణాలు కాపాడవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.ఉదయ్‌శంకర్, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ఉసురు తీస్తున్న చంద్రబాబు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లుగా అవ్వాతాతలకు ప్రతీ నెలా ఒకటో తేదీన అందిస్తున్న పింఛను డబ్బులు అందనీయకుండా అడ్డుకున్న చంద్రబాబుకు వారి ఉసురు తగులుతుందని వైఎస్సార్ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు మండిపడ్డారు. మండలంలోని గొల్లలపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఈశ్వర్‌కౌశిక్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో చంద్రబాబునాయుడు మూడు పార్టీల కూటమి ఏర్పాటు చేసుకున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను తన కుటుంబానికి, ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకే పంచిపెట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అవినీతికి తావు లేకుండా, పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా జమ చేశారన్నారు. గడప దాటలేని అవ్వాతాతలకు, దివ్యాంగులకు వలంటీర్ల ద్వారా ప్రతీ నెలా ఒకటో తేదీన వారి ఇంటి వద్దనే అందిస్తున్న పింఛన్ డబ్బులు వారికి అందనీయకుండా చంద్రబాబునాయుడు తన తబేదార్లతో ఈసీకి ఫిర్యాదు చేసి అడ్డుకున్నాడని ఆరోపించారు. దీంతో ఒకటో తేదీన పింఛన్లు అందక కొంతమంది వృద్ధులు అష్టకష్టాలు పడుతున్న సంఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని, వారి ఉసురు కూటమి నాయకులకు తగులుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేసిన మంచి చూసే ఓటేయాలన్న ధైర్యాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూర రామునాయుడు, కోరాడ రవికుమార్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం



ఉత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణంలోని మంగళవీధిలో కొలువైన నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ తెలిపారు. ఆలయ ఆవరణలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూకాలమ్మ అమ్మవారు 66వ వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించి జాతర ప్రారంభించామన్నారు. ప్రతీరోజూ రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 8న అమ్మవారి చల్లదనం మహోత్సవం, అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఘటాలతో, శక్తి, గరడి, పులి వేషాలతో జరిగే ఊరేగింపులో భక్తులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వజ్రపు నవీన్‌కుమార్, యడ్ల భాస్కరరావు, రొంగలి శరత్‌బాబు, రాజేంద్రప్రసాద్, వెంపడాపు వెంకటరావు, పిన్నింటి సునీల్, యడ్ల రాంబాబు, యడ్ల శ్రీనివాస్, తణుకు హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆటిజం సమస్యలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

- ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల చిన్నారులు, తల్లిదండ్రులు

విజయనగరం అర్బన్: పిల్లలో వచ్చే ఆటిజం సమస్యను ప్రాథమిక స్థాయిలోనే తల్లిదండ్రులు గుర్తిస్తే మంచిదని ఏ కిడ్స్ కేర్ సంస్థ ఎండీ ఎస్.నవీన్‌కుమార్ తెలిపారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం స్థానిక లార్వెన్స్ ఇన్‌స్పైర్ స్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న గణాంకాల ప్రకారం పుడుతున్న పిల్లల్లో ఆటిజం సమస్య ఉన్నవాలు అధికంగానే కనిపిస్తున్నారని అన్నారు. ఆటిజం సమస్యకు ఎటువంటి వైద్యం లేదని లక్షణాలకు అనుగుణంగా థెరపీ సెంటర్ల ద్వారా థెరపీ చేయించుకోవాలని సూచించారు. పుట్టిన మూడేళ్ల దాటినా మాటలు రాకపోవడం, కలర్స్‌ను గుర్తించకపోవడం, వారిలో వారే మాట్లాడుకుంటూ ఉండడం, అదే పనిగా చేతులు కొట్టుకోవడం, తదితర లక్షణాలు ఆటిజం గుర్తించేందుకు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్లవేళలా ప్రజల మనిషిని

- శిష్టకరణాల ఆత్మీయ కలయికలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



శిష్టకరణ ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: ఎల్లవేళలా తాను ప్రజల మనిషినని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. రింగురోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శిష్టకరణాల ఆత్మీయ కలయిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ నిజమైన, నీతివంతమైన పాలన అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకీ మరోసారి ప్రజలంతా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రతిపక్షం లేనిపోని అవాస్తవాలను మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అయితే విజ్ఞులైన ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. నగరంలోని 11 వాటర్ ట్యాంక్‌లు నిర్మించి అన్ని ప్రాంతాలకు దాహార్తిని తీర్చగలిగామన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల రూపంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేశారని కొనియాడారు. ఆయన అందిస్తున్న సంక్షేమంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటూ మౌలిక సదుపాయాలు వినియోగించుకుంటూ ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఆయనను నిర్వాహకులు గజమాలతో సత్కరించారు. పలువురు శిష్టకరణ సంఘం పెద్దలు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కోలగట్ల చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రేగ సురేష్, పట్టణ అధ్యక్షుడు సంజీవరావు పట్నాయక్, శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక భక్తి గీతాలాపన చేస్తున్న శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేట అనాసరపువారి వీధిలో ఉన్న శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో విశాఖకు చెందిన నిష్కమ ఫౌండేషన్‌కి చెందిన ఆధ్యాత్మిక ప్రవచన కర్త అరుణ దివ్యప్రవచనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈఓ ఎమ్.వంశీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఖ్యయోగం, భగవద్గీతలో రెండో అధ్యాయం, మహాభారతంలోని భీష్మపర్వం 25వ అధ్యాయం నుంచి 42వ అధ్యాయం వరకూ వివరించారు. భగవద్గీత మానవ జీవితంలో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవ జీవితంలో శాంతి, ఆనందం, ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక భక్తి గీతాలాపన ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ విభాగానికి ఏడు స్టాపర్‌ల వితరణ

విజయనగరం క్రైమ్: ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, వాహనాల మళ్లించేందుకు, వాహనాల తనిఖీల సమయాల్లో వినియోగించే స్టాపర్లు ఎంతో ఉపయోగపడతాయని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. యూనియన్ బ్యాంక్ అధికారులు ఏడు స్టాపర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద స్టాపర్ల అవసరం ఉందన్నారు. వీటిని సబ్ డివిజన్‌లోని అవసరమైన పోలీస్‌స్టేషన్‌లకు అందజేసి, వాటిని వినియోగిస్తామన్నారు. ఈ మేరకు బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ ఎ.శ్రీనివాసరావు, డీజీ పట్నాయక్, టూటౌన్ సీఐ కోరాడ రామారావు, రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ లోవరాజు, ఎఎం.రాజు, ఆర్.వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.